క్లుప్తంగా

రామలింగారెడ్డి సేవలు మరువలేనివి



రామలింగారెడ్డి విగ్రహం వద్ద నాయకులు, ప్రజాప్రతినిధులు

దుబ్బాక: దివంగత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి విగ్రహాన్ని దుబ్బాక పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి అన్నారు. రాజమండ్రిలో ప్రముఖ శిల్పి తయారుచేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామలింగారెడ్డి విగ్రహాన్ని రాయపోల్ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, దుబ్బాక కో–ఆప్షన్ సభ్యుడు ఆస స్వామితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి, పేదలకు రామలింగారెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, కృష్ణ తదితరులున్నారు.

రైతుబీమాను సద్వినియోగం చేసుకోవాలి



వివరాలు సేకరిస్తున్న సర్పంచ్ రమణారెడ్డి, అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): రైతులు బీమాను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చెరుకు రమణారెడ్డి అన్నారు. మండలంలోని అయినాపూర్‌కు చెందిన రైతు మల్లం సత్యనారాయణ ఇటీవల మరణించడంతో ప్రభుత్వం నుంచి రైతు బీమా మంజూరైంది. దీంతో ఆయన మంగళవారం ఏడీఏ రాధికతో కలసి నామిని వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, రైతులు నర్సింహారెడ్డి, మల్లం రాములు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం వినియోగంపై అవగాహన

హుస్నాబాద్: ఓటు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రతి ఓటర్ ఓటు హక్కును వినియోగించుకోవాలని రెవెన్యూ అధికారులు సూచించారు. హుస్నాబాద్ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం ఓటు వినియోగించే విధానంపై రెవెన్యూ అధికారులు ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈవీఎం వినియోగంఈపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుహాసిని, జూనియర్ అసిస్టెంట్ కరీం, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ అందించాలి

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులకు అల్పాహారంగా రాగిజావ అందించాలని ఎంఈఓ దేశిరెడ్డి హెచ్‌ఎంలకు సూచించారు. మండల వనరుల కేంద్రంలో మంగళవారం పాఠశాలల ఉపాధ్యాయులకు బెల్లం, రాగి పిండి ప్యాకెట్లను అందజేశారు. అనంతరం దేశిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు వారంలో మూడురోజులు రాగిజావ, మూడురోజులు గుడ్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రవీందర్‌రెడ్డి, మనీశ్‌కుమార్, రాజమౌళి, రజిత, సీఆర్పీలు పెంటయ్య, మోహన్‌బాబు, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తంజీమ్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తంజీమ్ ఎన్నికలను వెంటనే అధికారికంగా నిర్వహించాలని సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అత్తు ఇమామ్ మాట్లాడుతూ.. తంజీమ్ ఎన్నికలను అధికారికంగా నిర్వహించాలని చెబుతూనే, ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. బుధవారం పట్టణంలోని ఇక్బాల్ మినార్ వద్ద ఎన్నికలు నిర్వహించాలని ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్ పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

చేర్యాల(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రోడ్డుపై నిరసన వ్యక్తం చేసి, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన అనంతరం వేణు మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్, ఫీజురియంబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించకపోవడంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. దీంతో చాలామంది పేద విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేసే పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ పాలనలో పండగలా వ్యవసాయం

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించి, దండగా అన్న వ్యవసాయాన్ని పండగగా చేసి చూపించారని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం దూల్మిట్ట మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు ఉచిత విద్యుత్ పంపిణీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ఆత్మగౌరవంతో ఉండాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. దూల్మిట్ట క్లస్టర్ పరిధిలో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.21కోట్లు, రైతుబీమా ద్వారా రూ.5కోట్లు అందించామన్నారు. తెలంగాణ రాకముందు దూల్మిట్టలో సుమారు 2వేల ఎకరాలు మాత్రమే సాగు జరిగేదని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత సుమారు మూడింతలు సాగు పెరిగిందన్నారు. నాడు విద్యుత్ విషయంలో కాంగ్రెస్ పార్టీని తిట్టిన వ్యక్తి, నేడు అదే విద్యుత్‌పై అవగాహన లేని మాటలు మాట్లాడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైన 24గంటల విద్యుత్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని అక్కడి ప్రజలు ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు కేంద్రం మంజూరు చేస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఐటీ రంగంలో హైదరాబాద్ దేశంలో నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. ఏడాదికి మూడు పంటలు బీఆర్‌ఎస్ నినాదమని, మూడు గంటల కరెంట్ కాంగ్రెస్ విధానమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించి బీజేపీ, కాంగ్రెస్‌లకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ దూల్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగ్గిళ్ల తిరుపతిరెడ్డి, సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు అరుణ, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు బడుగు సాయి, ఎంపీటీసీ నందనబోయిన నర్సింలు, నాయకులు నాచగొని వెంకట్‌గౌడ్, తాళ్లపల్లి భిక్షపతిగౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు అండగా ఉంటాం



సిద్దిపేటరూరల్: బీఆర్‌ఎస్‌కు మద్దతుగా తీర్మానపత్రాన్ని అందిస్తున్న రైతులు

సిద్దిపేటరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల కోసం 24 గంటల విద్యుత్ అందిస్తూ, ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నందుకు గాను రైతులు ఏకగ్రీవంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మద్దతు నిలుస్తామంటూ తీర్మానం చేశారు. మంగళవారం నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలోని రైతువేదికలో కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటల కరెంట్ చాలు అంటూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. రైతుల ప్రభుత్వంగా ఉన్న బీఆర్‌ఎస్‌కు రైతులు ఎప్పుడు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ సంతోష్, రైతుబంధు సమితి అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): నాడు కాంగ్రెస్ పాలన, నేటి సీఎం కేసీఆర్ పాలనలో రైతులకు ఇచ్చిన విద్యుత్ సరఫరాపై అధికారులు గ్రామాల్లో చర్చించి అవగాహన కల్పించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం పాలమాకుల రైతు వేదికలో రాజగోపాల్‌పేట, ముండ్రాయి, బద్దిపడగ, జేపీతండా, దర్గపల్లి గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా నిలుస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, రమేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, పురేందర్, కృష్ణారెడ్డి, సర్పంచ్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

సిద్దిపేటఅర్బన్: వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు వంగ నాగిరెడ్డి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి రైతు వేదిక వద్ద మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి బేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అర్బన్ శాఖ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ వార్డు సభ్యులు జ్యోతి చంద్రయ్య, వరలక్ష్మిరామస్వామి, బీఎస్పీ మండల ఉపాధ్యక్షుడు కనకయ్యతో పాటు 60 మంది యువకులు మంగళవారం సర్పంచ్ చంద్రశేఖర్ గుప్తా, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్‌రావు నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి హరీశ్‌రావు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఇటిక్యాల అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా సర్పంచ్ చంద్రశేఖర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు స్వామి, కొండపోచమ్మ డైరెక్టర్ జానకీరాములు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్య, ఉపసర్పంచ్ రమేశ్, నాయకులు మీనయ్య, ఐలయ్య, గణేశ్, రాములు, రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

ఎంపీపీ అమరావతి



గజ్వేల్‌రూరల్: వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి

గజ్వేల్‌రూరల్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ దాసరి అమరావతి పేర్కొన్నారు. పట్టణంలోని ఐవోసీలో గల మండల పరిషత్ కార్యాలయ హాల్‌లో మంగళవారం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలను వేస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆరోగ్యవంతులుగా ఉంచుతూ రక్తహీనతకు గురికాకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, అధ్యాపకుల ద్వారా ఉచితంగా ఈ మాత్రలను అందిస్తారన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాహుల్‌కుమార్, ప్రణయ్‌రాజ్, ఎంపీఓ మచ్చేందర్‌తో పాటు వైద్య సిబ్బంది ఖాసీం, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఈ నెల 20న నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ బాలేషంగౌడ్ అన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులి పురుగుల నివారణపై వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ, వైద్యులు సత్యప్రకాశ్, రాజశేఖర్, సర్పంచ్ లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మంత్రి క్యాంపు కార్యాలయానికి వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జీపీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, జేఏసీ జిల్లా చైర్మన్ తునికి మహేశ్‌లు అన్నారు. జీపీ కార్మికుల జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయం వద్దకు వచ్చేందుకు ప్రయత్నించిన కార్మికులను పోలీస్‌లు కట్టడి చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి చొరవతో మంత్రి క్యాంపు కార్యాలయానికి కార్మిక సంఘాల నాయకులు వెళ్లి మంత్రి పీఏకు వినతి పత్రం అందించారు.

హుస్నాబాద్: తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చేందుకు క్యాంప్ కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీస్‌లు వ్యవసాయ మార్కెట్ గేట్ వద్ద అడ్డుకున్నారు. కొంతసేపు ఆందోళన చేపట్టారు. చివరకు సంఘ అధ్యక్షులకు పోలీస్‌లు అనుమతినివ్వడంతో వారు వెళ్లి ఎమ్మెల్యే పీఏ వేణుమాధవ్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, వివిధ మండలాల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కార్మికులకు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య మద్దతు తెలిపారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించేవరకు పోరాటం ఆగదన్నారు.

చర్యలు తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: జీపీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లోని 'గడా' కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం అధికారి ముత్యంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటచారి, స్వామి, మహాలక్ష్మి, కనకవ్వ, నాగరాజు, కుమార్, వెంకటేశ్, ఎల్లం, నర్సింలు, పోచయ్య, మల్లయ్య, గణేశ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: మార్కెట్ కార్యాలయం గేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మంత్రిని కలిసిన టీఎన్జీఓ కార్యవర్గం



మంత్రి హరీశ్‌రావుతో టీఎన్జీఓ జిల్లా కార్యవర్గం

సిద్దిపేటజోన్: నూతనంగా ఎన్నికైన తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కోమండ్ల విక్రమ్‌రెడ్డిలతో పాటు కార్యవర్గ సభ్యులను మంత్రి హరీశ్‌రావు అభినందించారు. కార్యక్రమంలో సహ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరాలయంలో అశ్లేష బలిపూజలు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో గల రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అశ్లేష బలిపూజ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాద వితరణ చేశారు. లోకకల్యాణార్థం ఈ పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ ఈ నెల 24న చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ గిరి కొండల్‌రెడ్డి, డివిజన్ జేఏసీ చైర్మన్ రామగుల్ల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలో మంగళవారం జరిగిన చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల జేఏసీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. డివిజన్ ఏర్పాటుకు విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, వివిధ కుల సంఘాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ సాధనే లక్ష్యంగా ఈ నెల 24న చేపడుతున్న చలో కలెక్టరేట్ ధర్నాకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు నర్సయ్యపంతులు, శ్రీనివాస్, లింగం, యాదగిరి, చిరంజీవులు, సత్యనారాయణ, నాగరాజు, నారాయణరెడ్డి, ప్రసాద్, అరుణ్, యాదగిరి పాల్గొన్నారు.

చేర్యాలలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలి



సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న నాగరాజు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న సైకిల్‌యాత్రను మంగళవారం పట్టణ కేంద్రంలో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, చేర్యాలలో పీజీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అరవింద్, కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షులు సంజీవ్‌కుమార్, రంజిత్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, సంతోష్, నాయకులు భాస్కర్, మధు, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు గజ్వేల్‌లో 5కే రన్

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5కే రన్‌లో యువతీ, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 6న సిద్దిపేటలోని రంగనాయక్‌సాగర్ ప్రాజెక్టుపై హాఫ్ మారథాన్ రన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 20న గురువారం గజ్వేల్‌లో ప్రమోషన్ రన్‌ను చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ పక్కన గల మైదానం నుంచి సంగాపూర్ ఔటర్ రింగు రోడ్డు మీదుగా ముట్రాజ్‌పల్లి ఔటర్ రింగురోడ్డు నుంచి తిరిగి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ఐవోసీ పక్కనగల మైదానం వద్ద ముగుస్తుందన్నారు. గురువారం ఉదయం 5:30లకు సిద్దిపేట సీపీ శ్వేత రన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్ సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత సూచనల మేరకు పట్టణంలోని నాగార్జున జూనియర్ కళాశాలలో మంగళవారం సీఐ వీరప్రసాద్‌తో కలిసి మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్థినులు చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సూచించారు. కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా వివిధ కార్యక్రమాలను చేపడుతూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు, మహిళలు ఏమైనా ఇబ్బందులకు గురైతే 100 లేదా షీటీమ్(8712667343), స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్(9494639498), మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట(8712667435)లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ అమృత్, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి, కానిస్టేబుళ్లు యుగేంధర్, అన్వేశ్, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా భవాని ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న గిరిజనులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని భల్లునాయక్ గిరిజన తండాలో శీత్లా భవాని ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ లకావత్ మానస మాట్లాడుతూ.. గిరిజనుల దైవం శీత్లా భవానీకి శ్రావణ మాసం మంగళవారం రోజు ఉత్సవాలను జరుపుకుంటారన్నారు. తొలకరి వర్షాలకు దుక్కులు దున్ని విత్తనాలు వేసిన గిరిజనులు పాడి పంటలు సంమృద్ధిగా పండాలని కోరుతూ ప్రకృతి దేవత శీత్లా భవానికి పూజలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో అక్కన్నపేట జెడ్పీటీసీ భూక్య మంగ, సర్పంచ్ రజిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు**

దుబ్బాక: పట్టణంలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం బైపీసీలో ఎస్సీ–13, ఎస్టీ–2 , బీసీ –1, ఓసీ–1 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కావున 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ఆసక్తి గల బాలురకు గురువారం కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ **లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి మంగళవారం తెలిపారు. కళాశాలలో గణితం–01, కంప్యూటర్ సైన్స్–01, చరిత్ర–01 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ చేసిన వారు ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులకు 55శాతం మార్కులు వచ్చినవారు అర్హులన్నారు. దీంతో పాటు సెట్, నెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 21 సాయంత్రం వరకు సర్టిఫికెట్స్‌తో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

◆ **ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం**

కోహెడ(హుస్నాబాద్): కోహెడ, చిన్నకోడూరు సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నకోడూర్ కళాశాల ప్రస్తుతం కోహెడలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత పొంది ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ నెల 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తులు స్వీకరించి మెరిట్ ప్రాతిపదికన కళాశాలలో ప్రవేశం కల్పించనున్నట్లు చెప్పారు.

◆ **బాధిత కుటుంబానికి చేయూత**

రాయపోల్(దుబ్బాక్): నిరుపేద కుటుంబాలకు తాను అండగా నిలుస్తానని కాంగ్రెస్ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కత్తి కార్తీకగౌడ్ అన్నారు. దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్‌కు చెందిన నీరుడి ప్రవీణ భర్త అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కత్తి కార్తీక బాధిత ప్రవీణను మంగళవారం పరామర్శించి రూ. 5వేల పోస్టల్ డిపాజిట్ బాండ్‌తో పాటు బేబీ కిట్, బేబీ డ్రెస్‌లను అందజేశారు.

◆ **పరామర్శ**

మర్కూక్(గజ్వేల్): మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన మందాల బాలస్వామి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు, వంటిమామిడి మార్కెట్ డైరెక్టర్ రాందాస్‌గౌడ్ మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందించారు.

◆ **ఆర్థికసాయం**

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతూ పేద కుటుంబాలకు చెందిన కరడేపల్లి మహేందర్, శాడ మల్లారెడ్డిలు మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలుపుతూ సీడీఆర్ సేనా సంస్థ చేతుల మీదుగా ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.

◆ **అధికారులపై చర్యలు తీసుకోవాలి**

నంగునూరు(సిద్దిపేట): పెద్ద వాగుపై నంగునూరు వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారడంతో నీరంతా వృథాగా పోతోందని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వాగు వద్ద నిర్మించిన పంపులను పరిశీలించారు. అనంతరం యాదగిరి విలేకరులతో మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకం కింద ఏర్పాటు చేసిన మోటార్లు పని చేయకపోవడంతో వాగు నిండినా సమీపంలోని చెరువులకు నీరు చేరడం లేదన్నారు. మంత్రి హరీశ్‌రావుకు ఈ విషయం తెలిసినా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో చెప్పాలన్నారు. ఆయన వెంట యాదగిరి, నాగరాజు, కృష్ణ, సంపత్, నర్సింలు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **ముసురులోనూ భూనిర్వాసితుల దీక్ష**

వర్గల్(గజ్వేల్): ముసురువానలోనూ వర్గల్ మండలం అవుసులోనిపల్లి వద్ద భూనిర్వాసితుల దీక్ష కొనసాగింది. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం సేకరించిన భూమికి చట్టబద్ధమైన పరిహారం అందజేయాలనే డిమాండ్‌తో మాజీ ఎంపీటీసీ యాదయ్య ఆధ్వర్యంలో భూనిర్వాసితులు కొనసాగిస్తున్న దీక్ష మంగళవారం 26వ రోజుకు చేరింది. రోజంతా ముసురు పడినా రైతులు మాత్రం దీక్ష వేదికపైనే కూర్చొని నిరసన కొనసాగించారు.